సాక్షి
గుంటూరు
శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



ముగిసిన చండీయాగం

పాత గుంటూరు: బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పాల్గొన్నారు.



ఆరు కరోనా పాజిటివ్ కేసులు

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా గురువారం ఆరు కరోనా కేసులు నమోదయ్యాయి. గుంటూరులో పలు ప్రాంతాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు వచ్చాయి.

ఎన్‌సీసీ లెఫ్టినెంట్‌తో ఎస్పీ



నగరంపాలెం: ఎన్‌సీసీ వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లాలో పర్యటిస్తున్న డీజీ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్ పాల్‌సింగ్‌ను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ గురువారం నగరంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహర్ (శని)
గుంటూరు	6:28	4:35
నరసరావుపేట	6:30	4:34
బాపట్ల	6:28	4:35

న్యూస్‌రీల్

మొక్కజొన్న క్వింటా రూ.1962

మద్దతు ధర వెల్లడించిన జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: రబీ సీజన్లో పండించిన మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ.1962 మార్క్‌ఫెడ్ ద్వారా చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పసుపుకు క్వింటాకు రూ.6850 ఇస్తున్నామన్నారు. ఈ నెల 15 నుంచి మొక్కజొన్న, పసుపు కొనుగోలు కేంద్రాల్లో శాంపిల్స్ పరిశీలన చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్‌లో నమోదైన రైతుల శాంపిల్స్‌ను రిజిస్టర్ చేస్తారని చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కాగా సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ గురువారం కమిషనరేట్ నుంచి నిర్వహించిన వీడియో సమావేశానికి గుంటూరు నుంచి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అధికారులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో నవోదయం

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీలకు విద్యా, ఉపాధి, ఆర్థిక సాధికారిత సాధనకోసం ప్రతి నెలా నిర్వహిస్తున్న నవోదయం కార్యక్రమం శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్ సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అవకాశాన్ని ఆయా వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బాపట్ల జిల్లా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లా నూతన కలెక్టర్‌గా రంజిత్ బాషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆయన బాపట్లకు చేరుకుని బాధ్యతలు స్వీకరిస్తారు. ఇటీవల జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా కృష్ణాజిల్లా కలెక్టర్‌గా ఉన్న రంజిత్‌బాషా బాపట్ల జిల్లా కలెక్టర్‌గా నియమితులైన విషయం తెలిసిందే.

యార్డులో 1,27,324 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు (గుంటూరు): స్థానిక మార్కెట్ యార్డుకు గురువారం 1,25,628 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,27,324 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 88,490 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 526.90 అడుగుల వద్ద ఉంది. ఇది 162.1584 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 5,087, ఎస్ఎల్‌బీసీకి 1,350, వరద కాలువకి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 6,737 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 6,737 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.80 అడుగుల వద్ద ఉంది. ఇది 31.4403 టీఎంసీలకు సమానం.

ఉద్యానానికి ఊతం

- డ్రైల్యాండ్ హార్టికల్చర్ ఉపాధి పథకం
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అమలు
- అడిగిన వారందరికీ అందించేలా చర్యలు
- 1 నుంచి ఆరంభమైన దరఖాస్తుల స్వీకరణ

కొరిటెపాడు (గుంటూరు): అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంటలోనూ రైతులకు మేలు జరిగేలా సంకల్పించింది. దీనిలో భాగంగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల సాగుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు ఉండగా ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం అందించేలా సన్నాహాలు చేస్తోంది.

ఐదెకరాల లోపు...

ఉపాధి హామీ పథకం ద్వారా అరెకరం నుంచి ఐదు ఎకరాల లోపు భూములున్న రైతుల నుంచి డ్రై ల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ పథకం ద్వారా పండ్ల తోటలు, పూల సాగుకు చర్యలు తీసుకుని రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. అలాగే ప్రస్తుతం ఉన్న పండ్ల తోటల్లోనూ అంతర పంటలు సాగు చేసుకునేలా వెసులుబాటు కల్పించనుంది.

పంట చేతికి వచ్చే వరకు..

ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసే పంటలు చేతికి వచ్చే వరకూ ప్రభుత్వం సాయం అందిస్తుంది. రైతు దుక్కి దున్నేందుకు, కందకాలు తీసుకునేందుకు, మొక్కల కొనుగోలు, మొక్కలు నాటడం వంటి పనులకు తోడ్పాటు అందిస్తోంది. అంతర్ పంటలుగా పూల సాగు చేస్తే ఏడాది పొడవునా రైతుకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకుంటోంది.

ఎకరాకు రూ.లక్ష..

ఉపాధి హామీ డ్రై ల్యాండ్ హార్టి కల్చర్‌లో భాగంగా నేల స్వభావాన్ని బట్టి రైతులకు మామిడి, చీని, నిమ్మ, దానిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, దానిమ్మ, సీతాఫలం, ఆసిడ్ లైమ్, బత్తాయ, చింత, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ, మల్లె, మునగ, తదితర పంటల సాగు కోసం రైతు నుంచి దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. గుంతలు తవ్వే దగ్గర నుంచి మొక్కలతో పాటు పురుగు మందుల వరకు సుమారు ఎకరాకు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వం వెచ్చించనుంది. దీంతోపాటు అదనంగా మూడేళ్ల పాటు మొక్కలకు నీటిని సైతం పెట్టి సంరక్షించేందుకు రైతుకు బిల్లులు అందిస్తారు.



ఉపాధి హామీ పథకం ద్వారా సాగవుతున్న డ్రాగన్ ఫ్రూట్ తోట



విరగ కాసిన మునగ సాగు..

మరింత మేలు



ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలకు తోడ్పాటు అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2.50 ఎకరాలలో ఉద్యాన పంటలున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా మరింత మంది రైతులను ప్రోత్సహించడం ద్వారా వేలాది ఎకరాల ఉద్యాన పంటలు సాగయ్యే అవకాశం ఉంది.

– ఎస్.సుజాత,
ఉద్యానశాఖ అధికారి, గుంటూరు జిల్లా.

రైతులను ప్రోత్సహించేలా..



రైతులను ప్రోత్సహించేందుకు, ఖర్చు లేకుండా ఆదాయాన్ని సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నెల మొదటి వారం నుంచి రైతులు ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. అరెకరం నుంచి ఐదెకరాల వరకు ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చు.

– యం.యుగంధర్ కుమార్,
డ్వామా పీడీ, గుంటూరు జిల్లా.

టీడీపీ కుట్రకు బ్రేక్

రాజధానిలో బహుజనుల హర్షాతిరేకాలు

తాడికొండ: అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పాన్ని అడ్డుకునే టీడీపీ యత్నానికి సుప్రీం కోర్టు బ్రేక్ వేసింది. దీంతో రాజధాని ప్రాంత పేదలలో హర్షాతి రేకాలు వ్యక్తమవుతున్నాయి..

కులవాదుల ఆగడాలకు కళ్లెం



రాజధాని పేరుతో పేదలను వేధింపులకు గురిచేసిన కులవాదులకు కోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. అసైన్డ్ భూములను బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేసిన కేసుల్లో కూడా నిందితులకు శిక్ష పడి కులవాదుల ఆగడాలకు కళ్లెం పడటం ఖాయం.

– నూతక్కి జోషి, బహుజన ఉద్యమ నాయకుడు

బాబు తీరు మార్చుకోవాలి



పేదలంటే అలుసుగా చూసే బాబు అండ్ కో ఇకనైనా తమ తీరు మార్చుకోవాలని, అన్ని వర్గాల అభివృద్ధితోనే సమ సమాజ నిర్మాణం సాధ్యమని, అలా కాకుండా ఓ ప్రాంతానికో ఓ వర్గానికో పరిమితమైతే భావితరాలకు అది ప్రమాదకరంగా మారుతుంది.

– పులి దాసు, బహుజన ఉద్యమ నాయకులు

సుప్రీం తీర్పుతో కళ్లు తెరవాలి



వికేంద్రీకరణ, ఇంగ్లిష్ మీడియం విద్యను అడ్డుకుంటూ కులవాదులు వేసిన కేసుల్లో కూడా కోర్టుల్లో మాకే సానుకూల తీర్పులు వస్తాయి. అన్యాయం అని తెలిసినా కులవాదంతో చేస్తున్న ఆగడాలు మితిమీరి పేదల భవిష్యత్‌కు ఇబ్బందిగా మారుతున్నాయి. సుప్రీం తీర్పుతో అయినా కులవాదులు కళ్లు తెరవాలి.

– ఇందుపల్లి సుభాషిణి,
బహుజన ఉద్యమ నాయకురాలు

అంబేడ్కర్ ఆలోచన విధానమే



పేదల కోసం రాష్ట్రంలో 35 లక్షల ఇళ్ల స్థలాలిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజధానిలో కూడా మాకు 54 వేల పట్టాలు ఇవ్వడం ఆయనలోని అంబేడ్కర్ ఆలోచనా విధానానికి నిదర్శనం. 75 సంవత్సరాల్లో ఏ ముఖ్యమంత్రి అందించని వరాలను మాకు అందించి సీఎం వైఎస్ జగన్ అంబేడ్కర్ ఆశయ సాధకుడు, ఆయన నేతృత్వంలో బహుజన రాజ్యాధికారం త్వరలో సాకారం కావడం ఖాయం.

– మాదిగాని గురునాథం, సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు

తప్పుడు కేసులు వేయడం దుర్మార్గం



సంతృప్తికరమైన ప్యాకేజీ తీసుకొని ప్రభుత్వానికి భూములిచ్చిన తరువాత కూడా దానిపై హక్కులు తమకు కావాలనుకోవడం దుర్మార్గం. సీఆర్డీయే పేరుతో చట్టం చేసిన చంద్రబాబు అందులో అన్నీ తనకు అనుకూలంగా చట్టాలను పొందుపరచుకోవడం దోపిడీకి ముందస్తు వ్యూహమే. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉండకుండా తప్పుడు కేసులు వేయడం దుర్మార్గం.

– ఈపూరి ఆదాం, బహుజన ఉద్యమ నాయకుడు

బహుజనులకు బంగారు భవిష్యత్



రాజధాని ప్రాంతం కులవాదుల సొత్తులా భావించి పేదలను వెళ్లగొట్టే కుట్ర చేసిన కులవాదులకు బుద్ధి చెప్పేలా జగనన్న తీసుకున్న నిర్ణయం బహుజనులకు ఈ ప్రాంతంలో బంగారు భవిష్యత్తును ఇచ్చింది. బాబా సాహెబ్ అంబేడ్కర్ సూచించిన బహుజన రాజ్యాధికారం త్వరలో సాకారం కానుందనేందుకు ఇదే నిదర్శనం.

– బేతపూడి సాంబయ్య, బహుజన ఉద్యమ నాయకుడు

హోర్డింగ్‌లకు.. జీపీఆర్ఎస్ అనుసంధానం

- క్యూఆర్ కోడ్ ఏర్పాటు
- స్కాన్ చేస్తే లొకేషన్, హోర్డింగ్ సైజు, చెల్లించాల్సిన బకాయిల వివరాలు
- నగరంలో 1460 అధికారిక హోర్డింగ్స్, ఎనిమిది వేలు అనధికారిక హోర్డింగ్‌లు
- పేరుకుపోయిన బకాయిలు
- ఇటీవల నాలుగు కోట్ల రూపాయలు వసూలు



హోర్డింగ్‌లకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నగర పాలక సంస్థ పరిధిలోని వాణిజ్య ప్రకటనల బోర్డులు (హోర్డింగ్స్)పై ఆదాయం పొందేందుకు వీలుగా ఇకపై క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నగరంలోని హోర్డింగ్స్ ఏర్పాటు ప్రక్రియ ఇకపై పూర్తి పారదర్శకంగా ఉండేలా, ప్రతి ప్రకటన బోర్డ్‌పై నగరపాలక సంస్థకు తగిన ఫీజులు చెల్లించేలా ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలులోకి తెస్తున్నారు. తొలివిడతగా బ్రాడీపేటలోని హోర్డింగ్‌లకు క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేశారు. గుంటూరు నగరంలో వేలాది హోర్డింగ్స్ ఉన్నాయి. వాటిని వాణిజ్యపరమైన అవసరాలకు ఉపయోగించుకుంటూ కూడా కార్పొరేషన్‌కు ఒక్కపైసా కూడా ఆదాయం కట్టకుండా సొమ్ము చేసుకుంటున్నారు. నగరంలోని అత్యంత ప్రాధాన్యత ఉన్న నాజ్‌సెంటర్, మార్కెట్ సెంటర్, బ్రాడీపేట, అరండల్‌పేట, లక్ష్మీపురం, బస్టాండ్, విద్యానగర్, బస్టాండ్ తదితర ప్రాంతాలలోని హోర్డింగ్‌లను టౌన్‌ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై ఏర్పాటు చేసుకున్నారు. వీటి ఏర్పాటు వల్ల కార్పొరేషన్‌కు ఎటువంటి ఆదాయం రాకపోగా టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఇది ఒక ఆదాయ వనరుగా మారింది. కొంతమంది ఏకంగా యాడ్ ఏజెన్సీలతో సిండికేట్ అయ్యి వాటిలో భాగస్వాములుగా మారిపోయారు.

హోర్డింగ్‌లు, బోర్డులు, జెయింట్ హోర్డింగ్స్ నిర్వహణకు నగరపాలక సంస్థ నుంచి విద్యుత్ సరఫరాను పొందుతున్న ఏజెన్సీలు కార్పొరేషన్‌కు మాత్రం డబ్బులు చెల్లించడం లేదు. హోర్డింగ్‌లపై వాణిజ్య ప్రకటనలు ఏర్పాటు చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అంశంపై ఇటీవల కౌన్సిల్‌లో చర్చకు రావడం ప్రజా ప్రతినిధులు ఈ అక్రమాలకు చెక్ పెట్టాలని కోరడంతో అందరితో చర్చించి మున్సిపల్ కమిషనర్ కొత్త విధానానికి తెరతీశారు. ప్రతి బోర్డుకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి బోర్డ్‌కి నగరపాలక సంస్థకు ఫీజులు ఎంత, ఎప్పటి వరకు చెల్లించింది, యజమాని తదితర వివరాలను కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చు. తొలి విడతగా బకాయిలు చెల్లించిన హోర్డింగ్‌లకు ఈ క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. క్యూఆర్ కోడ్‌లేని బోర్డులను అనధికారిక బోర్డులుగా పరిగణించి వాటిని తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బోర్డ్‌లకు ఏర్పాటు చేసే కోడ్‌లను మరొక చోట ఏర్పాటు చేయడానికి వీలు లేకుండా లాంగిట్యుడ్, లాటిట్యుడ్‌లో ఆయా బోర్డ్‌ల లోకేషన్ కేటాయింపు జరుగుతుంది. నగరంలో అన్ని యాడ్ ఏజెన్సీలు, వ్యక్తిగత బోర్డ్ లు కల్గిన వారు తప్పనిసరిగా బకాయిలు చెల్లించి, ఆయా బోర్డ్‌లకు క్యూఆర్ కోడ్‌ను ఏర్పా టు చేసుకోవాల్సి ఉంటుంది. గుంటూరు నగరంలో నాన్ ఏజెన్సీ బోర్డులు 178 ఉండగా, ఏజెన్సీలు ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ 1173 ఉన్నట్లు గుర్తించారు. ఇవి కాకుండా అనధికారిక బోర్డులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. సచివాలయాల వారీగా వీటిని గుర్తించే ప్రక్రియ చేపట్టారు. పాతబకాయిలపై ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరం, పాత బకాయిలు కలుపుకొని రూ.4.8 కోట్లు వసూళ్లు చేశారు.

క్యూఆర్ కోడ్ ద్వారా ఈ హోర్డింగ్స్‌కు అనుమతులకు సంబంధించి ఎటువంటి విషయాన్ని దాచడానికి వీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. రానున్న 20 రోజుల్లో బకాయిలు చెల్లించిన బోర్డ్ లకు కోడ్ ఏర్పాటుకు, బకాయిలు చెల్లించని వాటి తొలగింపుకు కమిషనర్ ఆదేశాల మేరకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.

ఆదాయమే లక్ష్యంగా..



నగర పాలక సంస్థ పరిధిలోని 207 వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న హోర్డింగ్స్‌పై సర్వే నిర్వహించి ఏజెన్సీల నుంచి బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాం. ప్రతి బోర్డుకు జియో ట్యాగింగ్, యూనిక్ నెంబర్, క్యూఆర్ కోడ్ ఏర్పాటు ద్వారా అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులు ఎటువంటి అవకతవకలకు పాల్పడే అవకాశం లేదు. దీనిద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు సహకారం కూడా బావుంది.

– చేకూరి కీర్తి, కమిషనర్

ఓటరు నమోదుకు చర్యలు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



గుంటూరు వెస్ట్: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 నుంచి 19 సంవత్సరాల మధ్య ఉన్న యువతను ఓటర్లుగా నమోదు చేయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ పీవీసీ ఎపిక్ కార్డులు ప్రింటింగ్ ఏజన్సీల నుంచి వచ్చిన వెంటనే వాటిని స్పీడ్ పోస్ట్‌లో సంబంధిత ఓటర్లకు పంపిస్తున్నామన్నారు. అభ్యంతరాలు, క్లెయిమ్స్‌ను నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి చేస్తున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ రామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పతకాలు వీరికే...

నగరంపాలెం: ప్రభుత్వం ఉగాది పండుగ పురస్కరించుకుని గురువారం వివిధ పతకాలు ప్రకటించింది. దీనిలో భాగంగా ఉత్తమ సేవా పథకం పి.నరేష్ కుమార్ (సీఐ, దిశమహిళ పోలీసు స్టేషన్), డి.ఎస్.ఆర్.కుమార్ (ఆర్ఎస్సై ఆరో బెటాలియన్ ఏపీఎస్పీ మంగళగిరి), ఎస్.శ్రీనివాసరావు (ఆర్ఐ ఏపీఎస్పీ ప్రధాన కార్యాలయం మంగళగిరి). కఠిన సేవాపతకం బి.వి.కృష్ణయ్య (ఏఆర్ఎస్సై– ఏపీఎస్డీఆర్ఎఫ్ మంగళగిరి), జె.హరిబాబు (ఏఎస్సై– ఏపీఎస్డీఆర్ఎఫ్ మంగళగిరి), ఎం.శ్రీనివాసరావు (హెడ్‌కానిస్టేబుల్ –ఏపీఎస్డీఆర్ఎఫ్ మంగళగిరి), బి.మురళీకృష్ణ (హెడ్‌కానిస్టేబుల్ –ఏపీఎస్డీఆర్ఎఫ్ మంగళగిరి), సేవాపతకం బి.భాస్కర్ (ఆర్ఐ తొమ్మిదో బెటాలియన్ ఏపీఎస్పీ మంగళగిరి), బి.విఠలేశ్వర రావు (ఆర్ఐ 6వ బెటాలియన్ – ఏపీఎస్పీ మంగళగిరి), కె.శ్రీహరి (ఇన్‌స్పెక్టర్– పీటీవో మంగళగిరి), పి.శివరామ్ బాపయ్య (ఏఎస్సై మంగళగిరి (ట్రాఫిక్ పీఎస్), ఎం.బ్రహ్మయ్య (హెడ్‌కానిస్టేబుల్, లాలాపేట పీఎస్), బి.డి.నాయక్ (ఏఆర్ఎస్సై ఆరో బెటాలియన్ మంగళగిరి), ఎస్.మూర్తి రావు (ఏఆర్ఎస్సై) ఉన్నారు.

నరసరావుపేట: పల్నాడు జిల్లాకు చెందిన అగ్నిమాపక శాఖ, పోలీసు విభాగాలకు చెందిన అధికార్లు, సిబ్బందికి ఉగాది సందర్భంగా ఈ ఏడాదికి ఉత్తమ సేవా పతకాలను ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఉత్తమ సేవాపతకాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి జి.బాలరాజుకు వరించగా, సేవా పతకాలు నరసరావుపేట, పిడుగురాళ్ల ఫైర్‌స్టేషన్లలో విధులు నిర్వహించే లీడింగ్ ఫైర్‌మాన్ ఎం.శ్రీనివాసరావు, డ్రైవర్ ఆపరేటర్ ఎస్.శ్రీనివాసరెడ్డికి లభించాయి. అలాగే డీసీఆర్‌బీలో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఎస్.ఎం.సుభాని, ఏఆర్ఎస్ఐ ఎన్.మల్లికార్జునరావు, డీఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ డి.గురుస్వామికి లభించింది.


నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.4,500 వరకు పలికింది.

టెన్త్ 'స్పాట్'కు పక్కాగా ఏర్పాట్లు

- ప్రతి ముగ్గురు ఏఈలకు ఒక సీఈ
- క్షుణ్ణంగా జవాబు పత్రాల పరిశీలన
- 26 వరకు నిర్వహణ
- 1,700 మంది ఉపాధ్యాయుల నియామకం
- రేపటితో ముగియనున్న టెన్త్ పరీక్షలు



గుంటూరులోని స్టాల్ బాలికోన్నత పాఠశాల

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్న ప్రభుత్వం, విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను పక్కా ఏర్పాట్ల మధ్య మూల్యాంకనం జరిపి ఫలితాలు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌ను నిర్వహించేందుకు జిల్లాలో ఏర్పాట్లు వేగవంతమయ్యాయి.

శనివారం జరగనున్న సాంఘిక శాస్త్ర పరీక్షతో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు ముగియనుండటంతో విద్యార్థులు రాసిన ఆన్సర్ స్క్రిప్ట్‌లకు వేగవంతంగా మూల్యాంకనం చేసి, వీలైనంత త్వరగా ఫలితాలు విడుదల చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గుంటూరులోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ఉన్న ప్రభుత్వ పరీక్షల విభాగ ఆధ్వర్యంలో టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ ఈనెల 19న ప్రారంభం కానుంది. గతేడాది వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదిక నిర్వహించిన మూల్యాంకన ప్రక్రియను కొత్త జిల్లాల ఏర్పాటుతో ఎక్కడికక్కడ నూతన జిల్లా కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. టెన్త్ మూల్యాంకన విధులకు జిల్లా వ్యాప్తంగా 1,700 మంది ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. వీరిలో జవాబు పత్రాలను మూల్యాంకనం నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జామినర్లతో పాటు వాటిని పరిశీలించే చీఫ్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లు ఉన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ స్పాట్ వాల్యూయేషన్ క్యాంపు అధికారిగా వ్యవహరించనున్నారు.

ముగ్గురు ఏఈలకు ఒక సీఈ, స్పెషల్ అసిస్టెంట్

విద్యార్థుల ఆన్సర్ స్క్రిప్ట్‌లకు మూల్యాంకనం నిర్వహించేందుకు ముగ్గురు చొప్పున అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈ)ను ఒక బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఆరుగురు ఏఈలను ఒక బ్యాచ్‌గా ఉన్న పరిస్థితుల్లో ప్రస్తుతం ఆ విధానాన్ని మార్చారు. ముగ్గురు ఏఈలకు ఒక చీఫ్ ఎగ్జామినర్ (సీఈ)తో పాటు ఒక స్పెషల్ అసిస్టెంట్ ఉంటారు. ఒక్కో ఏఈ రోజుకు 40 ఆన్సర్ స్క్రిప్ట్‌లను వాల్యూయేషన్ చేయాల్సి ఉండగా, ఏఈలు వాల్యూయేషన్ చేసిన స్క్రిప్ట్‌లను సీఈలు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. విద్యార్థులు రాసిన సమాధానాలు సరైనవీ, కానివీ పరిశీలించి, వేసిన మార్కులను నిశిత పరిశీలన చేస్తారు. అదే విధంగా ఆన్సర్ స్క్రిప్ట్‌లో ఏఈలు వేసిన మార్కులను కూడి, టోటల్ మార్కులను వేసే విధులను స్పెషల్ అసిస్టెంట్లు నిర్వర్తిస్తారు. ఈ విధంగా ప్రతి బృందం రోజుకు 120 స్క్రిప్ట్‌లకు మూల్యాంకనం జరిపి, మార్కులు వేయడంతో పాటు వేసిన మార్కులు సరిగ్గా ఉన్నవీ, లేనివీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. క్యాంపు అధికారికి సహాయకులుగా సహాయ క్యాంపు అధికారులను నియమిస్తున్నారు. సీనియర్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఎస్జీటీలు స్పాట్ వాల్యూయేషన్ విధుల్లో సీఈ, ఏఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా వ్యవహరించనున్నారు.

పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

19 నుంచి 26వ తేదీ వరకు స్పాట్ వాల్యూయేషన్ నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో పి.శైలజ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే స్పాట్ వాల్యూయేషన్ విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు అవసరమైన తాగునీరు, టాయిలెట్లు, క్యాంటిన్ వంటి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. స్పాట్ వాల్యూయేషన్ విధులకు నియమించిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి, నియమావళిపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

బీసీలకు సీఎం జగన్ పెద్దపీట


బీపీ మండల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు

నెహ్రూనగర్(గుంటూరు): బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నారని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. ఓబీసీ రిజర్వేషన్ల సాధకుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బీపీ మండల్) వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఇన్నర్ రింగ్‌రోడ్డులోని బీపీ మండల్ విగ్రహానికి బీసీ సంఘ నాయకులతో కలిసి మస్తాన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. మస్తాన్‌రావు మాట్లాడుతూ బీపీ మండల్ సిఫార్సుల వల్లే ప్రస్తుతం బీసీలు రిజర్వేషన్లు పొందగలుగుతున్నారని వివరించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ బీసీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రశంసించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మండల్-2 ఉద్యమం గుంటూరు నుంచే ఆరంభం కావాలన్నారు. తెలంగాణ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా బీపీ మండల్ కాంస్య విగ్రహం గుంటూరులో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం బీపీ మండల్ ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు.

రైతులకు అండగా ప్రాసెసింగ్ యూనిట్లు

- ఫైలెట్ ప్రాజక్ట్‌గా దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డు ఎంపిక
- సీడబ్ల్యూసీ ఎండీ అమిత్ కుమార్ సింగ్


ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అమిత్ కుమార్ సింగ్

మంగళగిరి: రైతులకు అండగా ఉండేందుకు సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) కృషి చేస్తోందని కార్పొరేషన్ ఎండీ అమిత్ కుమార్ సింగ్ తెలిపారు. శుక్రవారం దుగ్గిరాలలో పసుపు మార్కెట్ యార్డులో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించిన ఎండీ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో తొలిసారిగా దుగ్గిరాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పసుపు, కారం పొడి తయారీ యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. రూ.25లక్షలతో ఏర్పాటు చేసిన పొడి తయారీ యంత్రాలు విజయవంతమైతే మరిన్ని ప్రదేశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. పసుపు రైతులకు అధిక ఆదాయం చేకూర్చేలా ఈ పొడి తయారీ యంత్రాలు ఉపయోగపడతాయన్నారు. రైతు పసుపును పొడి చేసి విక్రయిస్తే కనీసం మరో రూ.5వేలు లాభం వస్తుందన్నారు. సాధారణంగా కిలో పొడి తయారీకి రూ.6-7 వరకు తీసుకుంటారని, యార్డులో రూ.5కే చేస్తారని తెలిపారు. సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్‌లలో పసుపు, మిర్చి నిల్వ చేసుకున్న రైతులకు మరింత తక్కువ ధరకే పొడి చేస్తారన్నారు. రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎస్.శ్రీకాంత్ నాథ్ రెడ్డి, డీజీఎం జ్ఞానపాండే, రీజినల్ మేనేజర్ అజయ్‌జాదూ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజి, సీడబ్ల్యూసీ మేనేజర్ నిర్మలా బాయి పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ నుంచి రక్ష

- బాధితులకు ప్రభుత్వం బాసట
- వైద్యఆరోగ్యశాఖ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు
- ముందు జాగ్రత్తే మందు అంటున్న వైద్యులు
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే దుష్ప్రభావాల నుంచి విముక్తి
- సమస్య తీవ్రమైతే ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు

గుంటూరు మెడికల్: ఫ్లోరోసిస్ మహమ్మారి కట్టడికి ముందు జాగ్రత్తే మందు. అందుకే ప్రభుత్వం ప్రజలను రక్షించేందుకు కట్టుదిట్ట చర్యలు చేపడుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తోంది. ముఖ్యంగా ఫ్లోరైడ్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై దృష్టి పెట్టింది. బాధితులకు మందులూ ఉచితంగా అందజేస్తోంది. ఫ్లోరోసిస్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే దాని వల్ల తలెత్తే ఇతర దుష్ప్రభావాలను పూర్తిగా కట్టడి చేయవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు.

49 గ్రామాల్లో బాధితులు

కొత్తగా ఆవిర్భవించిన అవశేష గుంటూరు జిల్లాలోని 49 గ్రామాల్లో ఫ్లోరోసిస్ బాధితులు ఉన్నారు. మంగళగిరి, తాడికొండ, గుంటూరు రూరల్, ప్రత్తిపాడు, తాడేపల్లి, మండలాల్లో ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలు ఉన్నాయి.

దంత ఫ్లోరోసిస్ బాధితులే ఎక్కువ

గత ఏడాది ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు వైద్య సిబ్బంది స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. గుంటూరు జిల్లాలో 116 పాఠశాలల్లో 4,539 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేయగా, 252 మందికి దంత సంబంధిత ఫ్లోరోసిస్ ఉన్నట్లు నిర్ధారించారు. జిల్లా వ్యాప్తంగా 793 ఇళ్లు తిరిగి 3,050 మందిని స్క్రీనింగ్ చేయగా 23 మందికి డెంటల్ ఫ్లోరోసిస్ ఉన్నట్లు నిర్ధారించారు. వీరందరికీ విటమిన్ సీ మాత్రలను వైద్యఆరోగ్యశాఖ ఉచితంగా పంపిణీ చేస్తోంది.


ఫ్లోరోసిస్‌పై ముద్రించిన అవగాహన కరపత్రం

పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో..

పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో ఫ్లోరోసిస్ బాధితులు ఉన్నారు. నూజెండ్ల, వినుకొండ, రొంపిచర్ల, బొల్లాపల్లి, శావల్యాపురం, యడ్లపాడు, చిలకలూరిపేట, నరసరావుపేట, మండలాల్లో అత్యధిక సంఖ్యలో ఫ్లోరోసిస్ బాధితులు ఉన్నారు. పల్నాడులో ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు ఏడాది పాటు 7,977 ఇళ్లు సర్వేచేసి 963 మంది ప్రజలు ఫ్లోరోసిస్ బారిన పడినట్లు నిర్ధారించారు. జిల్లా వ్యాప్తంగా 799 పాఠశాలల్లో 23,875 మంది విద్యార్థులను పరీక్షించి 4,188 మంది విద్యార్థులు దంత ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. 37 మంది పెద్దవారు ఎముకల ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. వీరికి వైద్యసేవలు అదించేందుకు చర్యలు చేపట్టారు.



ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యాలయం

గమనించాల్సిన అంశాలు

- ఫ్లోరైడ్‌తో కలుషితమైన నీటిని తాగకూడదు.
- ఫ్లోరైడ్ అధికంగా ఉన్న ప్రదేశాల్లో పండిన కూరగాయలు, పాలు, తేయాకు, మాంస ఉత్పత్తులు ప్రమాదకరం.
- బ్లాక్‌టీ, సుపారి, రాక్‌సాల్ట్, పాన్‌పరాగ్, పొగాకు ఫ్లోరోసిస్‌కు కారకం కావచ్చు.
- ఫ్లోరైడ్ కలిగిన టూత్‌పేస్టులు, మౌత్‌వాష్ వాడరాదు.
- అల్యూమినియం పాత్రలను వంటకు వినియోగించకూడదు.
- పాలు, పెరుగు, జున్ను, బెల్లం, ఆకు కూరలు, జీలకర్ర, మునగ, ఉసిరి, జామ, నిమ్మ, నారింజ, టమాట, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, వెల్లుల్లి, అల్లం, ఉల్లి, క్యారెట్, బొప్పాయి, చిలకడ దుంపలు ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణకు దోహదపడతాయి.

ఉచితంగా వైద్య పరీక్షలు



ఫ్లోరోసిస్‌ను గుర్తించేందుకు ఉచితంగా పరీక్షలు చేస్తున్నాం. రోగ నిర్ధారణై సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నాం. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ, గుంటూరు

పుట్టబోయే బిడ్డలను కాపాడవచ్చు



ఎముకల ఫ్లోరోసిస్‌తో కాళ్లు, చేతులు వంకరపోతాయి. వెన్నెముక కట్టెలా బిగుసుపోతుంది. కండరాలు, లిగమెంట్స్, కణజాలాలు, ఎర్రరక్తకణాలు, వీర్యకణాలు, ఉదరభాగంలోని జీర్ణవ్యవస్థపై ఇది ప్రభావం చూపిస్తుంది. ఎముకలు పెలుసుబారతాయి. దంత ఫ్లోరోసిస్ వల్ల పళ్లు పసుపులేదా గోధుమ రంగు నుంచి నల్లగా మారతాయి. గర్భిణులకు ముందస్తుగా పరీక్షలు చేయటం వల్ల పుట్టబోయే పిల్లలు ఫ్లోరోసిస్ బారిన పడకుండా కాపాడవచ్చు.

డాక్టర్ జె.నరేష్‌బాబు, వెన్నుముక శస్త్రచికిత్స నిపుణులు.

భూసార పరీక్షలతో బహుళ ప్రయోజనాలు

- రేపటి లోపు మండల స్థాయిలో వర్క్‌షాపులు నిర్వహించాలి
- భూసార పరీక్షల ప్రయోజనాలు తెలియజేయండి
- జిల్లా స్థాయి వర్క్‌షాపులో డీఏఓ నున్న వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న డీఏఓ నున్న వెంకటేశ్వర్లు

కొరిటెపాడు(గుంటూరు): భూసార పరీక్షలతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు చెప్పారు. భూసార పరీక్షలతో కలిగే ఉపయోగాలపై క్షేత్రస్థాయిలో రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఏడాది ప్రభుత్వం పెద్ద ఎత్తున భూసార పరీక్షలు నిర్వహించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందేలా రైతులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. స్థానిక కృషీ భవన్‌లో డివిజన్, మండల, గ్రామస్థాయి వ్యవసాయశాఖ అధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ, పరీక్ష విధానంపై గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్ మొదలు ఏడీఏ వరకు భూసార పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. పరీక్షలను ప్రామాణికంగా తీసుకుని రసాయన ఎరువులు, సూక్ష్మపోషకాలను వాడితే పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడులు లభిస్తాయని చెప్పారు. భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. భూమి చౌడు ఏ మోతాదులో ఉందో తెలుసుకుని చౌడు ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ నెల 15లోపు విధిగా మండల స్థాయిలో వర్క్‌షాపులు నిర్వహించి.. ఆయా మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, సిబ్బందికి అవగాహన కల్పించడంతోపాటు రైతులను భాగస్వాములను చేయాలని సూచించారు. మే చివరి నాటికి రైతులకు భూసార పరీక్ష ఫలితాలు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. లాం ఫాం శాస్త్రవేత్త మధువాణి మాట్లాడుతూ భూసార పరీక్షలతో నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలు ఎరువుల మోతాదును తెలుసుకోవచ్చన్నారు. డీడీఏ రామాంజనేయులు, ఎస్‌టీఎల్ ఏడీఏ రామ్మోహన్ పొలాల్లో మట్టిని సేకరించే విధానం, దాన్ని ప్రయోగశాలలకు ఎలా పంపించాలనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. వర్క్‌షాపులో ఏడీఏలు, ఏఓలు, ఏఈఓలు, ఆర్‌బీకేల ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

శుభసూచికం 'నవరత్నాలు'



మహానేత రాజన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

- మంత్రి అంబటి రాంబాబు
- 'జగనన్న పాలనలో గ్రామ స్వరాజ్యం – సంస్కరణలు' అంశంపై గుంటూరులో సమావేశం

పట్నంబజారు: నవరత్నాలు.. నవోత్సవాలు.. రాష్ట్రానికి శుభసూచికమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జగనన్న పాలనలో గ్రామ స్వరాజ్యం–సంస్కరణలు అనే అంశంపై సమావేశం జరిగింది. సమావేశానికి పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మాదా రాధ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ ఎన్నికలు రానున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సర్వసన్నద్ధం కావాలని, దానికి పూర్తిస్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తలు సహకరించాలన్నారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని, కేవలం పాలకులు మాటలకే పరిమితమయ్యేవారని, కాని దానికి ఆచరణలో పునాదులు వేసిన వ్యక్తి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ఎన్నో సమస్యల పరిష్కారానికి నాంది పలికారన్నారు. పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రతి గడపకు సంక్షేమం, అభివృద్ధి చేరవేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు, గ్రామాల అభివృద్ధికి సంబంధించి వై.ఎస్.జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. జిల్లాలు చిన్నవి కావడంతో పరిపాలన ప్రజలకు చేరువైందన్న అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. గత పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, కాబట్టే పరిపాలన పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, రాష్ట్రం అభివృద్ధిలో పయనిస్తోందని, తట్టుకోలేని చంద్రబాబు ఆ పార్టీ నేతలు విష ప్రచారానికి నాంది పలికారన్నారు. ఖచ్చితంగా సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పదవులు అనేవి అలంకారప్రాయం కాదని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలన్నారు. కష్టపడి పని చేయడం ద్వారానే వైనాట్ 175 తథ్యమన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేయడంతోపాటు, సుపరిపాలనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పార్టీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు తాడిశెట్టి మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గతంలో కంటే మంచి పాలన అందుతోందన్నారు. కార్యక్రమంలో ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పెరికల కృష్ణమోహన్, మురళి, అల్లాబక్షు, కార్పొరేటర్లు అడకా పద్మావతి, శ్రీవల్లి, గనిక ఝాన్సీ, బత్తుల అనురాధ పాల్గొన్నారు.

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు పోస్టింగ్స్

- నియామక పత్రాలు అందజేత
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 211 మందికి ఉద్యోగం
- కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన 15 మంది
- విధుల్లో చేరేందుకు 15 రోజుల గడువు


నియామక పత్రాలు అందజేస్తున్న డీఈవో శైలజ, డీవైఈవో సుధాకర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం నియామకపత్రాలు అందజేశారు. గుంటూరు డీఈఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరైన 211 మంది అభ్యర్థులు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా మినిమం టైం స్కేల్‌పై పని చేసేందుకు అంగీకరించడంతో వారిని పాఠశాలల్లో నియమిస్తూ ఆర్డర్లు ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 226 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, వెబ్‌సైట్‌లో జాబితాను ఉంచిన విద్యాశాఖాధికారులు బుధవారం సంబంధిత అభ్యర్థులను డీఈవో కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు పిలిచారు. 15 మంది అభ్యర్థులు గైర్హాజరు కావడంతో మిగిలిన 211 మందికి నియామకపత్రాలు అందజేసిన డీఈవో పి.శైలజ, గుంటూరు డీవైఈవో కె.సుధాకర్‌రెడ్డి వారికి అభినందనలు తెలియజేశారు. నియామకపత్రాలు పొందిన ఉపాధ్యాయులు 15 రోజుల్లోపు సంబంధిత పాఠశాలలో చేరాలని డీఈఓ స్పష్టం చేశారు. మినిమం టైం స్కేల్‌పై నియమితులైన ఈ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నెలకు రూ.32 వేల వేతనం లభించనుంది.

ఎంపీహెచ్‌ఏలకు కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్ : మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) వైద్య సిబ్బందికి గురువారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పునర్విభజన కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా ఆరోగ్య కేంద్రాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. జిల్లాల విభజన అనంతరం ఇప్పటి వరకు ఎంపీహెచ్‌ఏలకు కౌన్సెలింగ్ జరగలేదు. కొంత మంది సిబ్బంది తాము పనిచేస్తున్న ఆరోగ్య కేంద్రాల్లోనే తమను కొనసాగించాలంటూ కోర్టుకు వెళ్లడంతో కౌన్సెలింగ్ ప్రక్రియ వాయిదా పడింది. ఎట్టకేలకు గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీహెచ్‌ఏ వైద్య సిబ్బంది 222 మందికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు అందజేశారు.

పాలిటెక్నిక్ విద్యార్థి మృతదేహం వెలికితీత



గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామం తురకపాలెం రోడ్డులోని కోనేరు వద్ద గల బావిలో ఈతకోసం దిగి బుధవారం గల్లంతైన పాలిటెక్నిక్ విద్యార్థి భరత్‌చంద్ర(18) మృతదేహాన్ని పోలీసులు గురువారం వెలికితీశారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ నరహరి ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు బావిలో దిగి రెండుగంటలకు పైగా శ్రమించారు. అయినా భరత్‌చంద్ర జాడ కానరాకపోవడంతో బావిలోని నీటిని ఇంజిన్ల ద్వారా తోడించారు. అప్పటికి ఫలితం లేకపోవడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపారు. సుమారు రెండున్నర గంటలకుపైగా ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కష్టపడి ఎట్టకేలకు మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనంతరం మృతదేహాన్ని భరత్‌చంద్ర తల్లి అరుణకు అప్పగించారు. భర్త చనిపోయిన నాటినుంచి తనకున్న ఇద్దరు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చానని, చేతికందివచ్చిన పెద్దకొడుకు చదువుకునేందుకు వచ్చి ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లాడని ఆమె విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భరత్‌చంద్రతోపాటు ఆ ప్రదేశంలోకి వెళ్లిన మరో 9 మంది విద్యార్థులను విచారణ చేస్తున్నారు.